

# నటన

## వెలుగు వెంకటసుబ్బారావు

'ఈసారైనా సమాచారమంతా సేకరించుకురండి'?

కింద ఎండలో నిలబడ్డ జడ్వీ చెప్తుండగానే బస్ స్టాండులో నిలిచిన బురదలాంటి వాన నీటిమీద తెప్పలా తేలిపోతూ బస్సు కదిలింది. నేనూ, సుబ్రమణ్యం, ఆనందం వెళ్ళిరమ్మని ఆయనకు చేతులూపాం.

రెండేళ్ళ నుండి వాయిదా వేస్తున్న నిజాంపట్నం ప్రయాణం యిప్పటికి ముడి బడింది. అక్కడివారి గురించి నాచేత నాటకం రాయించి ఆడాలని జాంద్రపేట జ్యోతి ఆర్ట్స్ ప్రయత్నం. ఆనందం, సుబ్రమణ్యం నటులు, జడ్వీ ఆ ఔత్సాహిక నాటక సమాజానికి పేరున్న దర్శకుడు. ఒకసారి నేనొక్కడ్నే పోయొచ్చినా, నిజాంపట్నం పరిసరాలూ, బ్రతుకులూ నా మనస్సుకెక్కలేదు. అంతా గజిబిజిగా తడుముకున్నట్టుగా వుండి నాటకం ముందుకు సాగలేదు. రోజా పీరాల – నిజాంపట్నం తిరిగే బస్ కండక్టర్ మిత్రునికి అక్కడి మర పడవల వాళ్ళతోనూ, జాలర్లతోనూ సన్నిహిత సంబంధాలున్నాయని విని ఆయన ముందుగా వాళ్ళతో మాట్లాడిరమ్మంటేనే కొంతైనా వారి జీవన విధానం తెల్సుకొద్దామనీ అరకొరగా జ్ఞాపకం వున్న అభిప్రాయాలకు ఒక ఆకారం యిద్దామనీ యిలా బయలుదేరాం. బస్సు బయ్యన పోతోంది. బస్సు కుదుపులు వుయ్యాలూపినట్లుండి ఎప్పుడు నిద్రపోయాడో ఆనందం సన్నగా గురక తీయడం ప్రారంభించాడు. సుబ్రమణ్యం పక్క వాళ్ళతో సినిమా చర్చల్లోకి దిగాడు. కండక్టర్ మిత్రుడు ఫ్రంట్ సీటులో నా పక్కన కూర్చొని చార్టు చూచుకొంటున్నాడు. నేను అప్పడప్పుడు వాచీ గమనించి దిన పత్రిక తిరగేస్తున్నాను.

సరిగ్గా మధ్యాహ్నం 2 గంటలకు బస్సు నిజాంపట్నం స్టాపులో ఆగింది. కండక్టర్ రామారావ్ దిగుతూనే 'రండి'! అన్నాడు. ముగ్గురం అనుస

రించాం. హోటల్లా కనిపిస్తున్న పాక దిక్కు నాలు గడుగులు వేసి పాకముందు నిల్చొని మమ్మల్నే గమనిస్తున్నవాళ్ళ"ఏంత సేపైంది!" వచ్చి అని అడిగాడు. అతను"ఈ దినం ఏటకెల్లలేదు, మీ కోసరమే సూత్తున్నా"అన్నాడు. ఐదుగురం హోటల్లోకి పోయి ఎదురెదురు రాతి బెంచీల మీద సర్దుకున్నాక రామరావుగారు"ఇతను కొండలు, వీరు నువ్ చెప్పే విషయాలు రాసుకోడానికి వస్తారన్నానే, వాళ్ళు"అవి పేరు పేరునా సంగ్రహ పరిచయాలు చేశాడు. సుబ్రమణ్యం ఐదు బజ్జీ ప్లేట్లకు ఆర్డరిచ్చాడు. తీసుకోడానికతను తటపటాయిస్తుంటే "మీరో ఇలా సేపు మాట్లాడాలి తినండి" అన్నాడు ఆనందం."తినడం ఇల్లైతే సెప్పడం కూడా ఇల్లే అంటూ నంటూరా"నవ్వాడు. ఆ మాటతో సారా వాసన ఎదురునుంచి నా మీదికి దూకింది. తేరిపార జూశాను. వయస్సు ముప్జై దాటుంటుంది. మురిగ్గా దృఢంగా వున్నాడు. అక్కడక్కడా మీసాలూ, గడ్డం నెరసింది. రంగు బనీను, చారల లుంగీ, జుట్టు నిర్లక్ష్యంగా చెదిరి వుంది. భాషా, వుచ్చారణా తమిళనాడు నుంచి మా ప్రాంతం వచ్చిన పట్టపోన్ని గుర్తుకు తెస్తోంది. రామారావు "టీ తాగి సాయంత్రం ఆరుగంటల ట్రిప్పుకు సిద్ధం కండి. కొండలూ! వివరాలు త్వరగా తెముల్చు, వస్తా!" అంటూ బస్సెక్కగానే నల్గురం నిజాంపట్నం తెప్పల రేవుకి నడ్చాం. చుట్టూ ఎప్పుడో నేను చూచిన ప్రదేశాలే నా మతిమరుపు పొరల్లోంచి పెల్లగిలి జ్ఞాపకమొస్తున్నై. అలా రెండు గంటలు మరపడవల పనివాళ్ళనీ, యజమాన్లనీ పలకరించి విషయాలు పొందు పరుచుకుంటూ తిరిగి బస్ స్టాప్ దగ్గర్లో వున్న చెట్టు నీడ కూర్చున్నాక "కొండలూ, నువ్వు ఎన్నో మరవురాని సంఘటనలు చూసుండొచ్చు, వాటిల్లో ముఖ్యమైనవిగా భావించే కొన్నిటినైనా చెప్ప, రాసుకుంటానని పాకెట్ నోట్ బుక్ తెరచి కలం పట్టుకున్నాను. "అలాగే" అని చెట్టు కానుకొని ఎటో చూస్తూ కొద్ది క్షణాల్లో నిశ్శబ్దం వహించి చెప్పడం మొదలెట్టాడు.

×××

తొలి కోడి కూతకు కాస్త ముందూ వెనుకా వానజల్లు ఆరంభమైంది. నిజాంపట్నం వులికిపడి మేలుకొన్నట్టు గుడిసెల్లో, మిద్దెల్లో, సంద్రతీరంలో ఒక్కసారే గుప్పున కలకలం ఒకర్నొకరు పిలుచుకొంటూ ఆలస్యమైందని అరచుకొంటూ వలలు భుజానేసుకొని పోతున్న జాలర్ల వురుకులూ పరుగులూ అక్కడక్కడా గుడిసెల్లోంచి పిల్లల అల్లరీ తల్లుల సముదాయంపూ నిశ్శబ్ద ప్రకృతిని చీలుస్తూ తేలి తేలి విన్పిస్తోంది. సముద్రం కుక్కలా 'ఓ'మని ఏడుస్తున్నట్టుగా వుంది.

బుట్టమార్కు గొడుగేసుకు నడుస్తున్నా లక్ష్మయ్య జుట్టు తుంపర్లకి తడ్సి తలలో ఆలోచనలాగే చీదరగా వుంది. వెన్నెల్లో గూడా వేడిగా వుంది. డాక్టరేమో తేమగాలి తగిల్నా మంచులో తిరిగినా ఇస్నోఫీలియా తగ్గదన్నాడు. మరపడవల వ్యాపారమేమో ఒకసారి గాకున్నా ఒకసారన్నా సంద్రం దరికి పోకుంటే మునిగి పోయేట్టుంది. ఎవడూ చెప్పిన మాట తీరుగా వినడూ చేయడు. మేనల్లుడని డ్రైవరుగా పెట్టుకున్న రంగడు కూడా లస్కర్లతో కల్సిపోయి మోసం చేస్తున్నాడేమో అని అనుమానం గూడా కల్గుతోంది. ఈవేళ దుర్గగాడ్ని నయానా భయానా వప్పించి పనిలోకి పంపాల. చిన్నోడైనా గట్టి లస్కరు ముగ్గురి పెట్టు పని చేస్తాడు. జారిపోనివ్వకూడదు అని తలపోస్తూ ఒక గుడిసె ముందాగి"దుర్గా! రేయ్ దుర్గా!" అని గొంతెత్తి పిలిచాడు. రెండో కేకకి సోమి బైటికొస్తూ"ఓరూ, లచ్చుమయ్యగోరా! తంబి కోసరవా? పిలుత్తానుండండి"అని గట్టిగా కేకేస్తే కాలుతీసి కాలు పెట్టడమే కష్టమన్నట్టు నడవలేక గుడిసెలోంచి వచ్చాడు దుర్గ. వయస్సు ఇరవై ఐదేళ్ళు మించకున్నా ముప్జై యేళ్ళవాడిలా ఏదో జబ్బుతో నలిగినట్టు నీరసంగా వున్నాడు."వారం రోజుల్నుంచి దూటీకి రావడం లేదేం?"లక్ష్మయ్య అడిగినదానికి దుర్గ మాట్లాడలేదు."పలకవేంరా?" సోమి తమ్ముడ్ని గద్దించాడు.


"ఏరా దుర్గా, అరవై వేల రూపాయలకి హల్లు తయారుసేసి కర్రలూ, మేకులూ గొట్టి నలభై వేల రూపాయలు సావుకార్లవద్ద రొయ్య వేత్తానని అప్పుతెచ్చి మిగతాయిరవై వేలు యింకో రేవులో వడ్డీకితెచ్చి గీరుబాక్సూ, ఐసుబాక్సూ సిద్ధం చేసి మరబోటుని మీ లస్కర్లసేతిలో పెడ్తే నాపని ఎగతీసుడు దిగతీసుడుగా వుంది. సొంత బిడ్డలా సూసుకుంటున్న నువ్వు గూడా సెప్పా పెట్టకుండా మానేత్తే నట్టం నాకేగా! యిదేవయినా నేయంగా వుందా?" ఏబై ఐదేళ్ళ లక్ష్మయ్య జారే లుంగీ పైకి దోసి మొలతాడుకి బిగిస్తూ అభిమానం వొలకబోశాడు. తాను లాభాలు గడిస్తున్నా నష్టాల్లో కూరుకుపోతున్నట్టు చెప్పడం నిజాంపట్నం తీరవాసులు వినడం మామూలే అందుకని ఎవరూ ఆయన మాటని సీరియస్‌గా పట్టించుకోరు. దుర్గ కూడా ఆ విషయం తేలిగ్గా తోసేస్తూ"..మూడు మైళ్ళు బావుల్లోంచి మీ యింటికి మంచినీల్లు మోసినందుకు, నమ్మకంగా దూటీ సేసినందుకు ముప్జై రూపాయల జీతం ఐదు బేటా ఆయిలు కర్చూ మీ రొండు వాటాలూ పోను ఆరుగురి లస్కర్లకీ అంతో ఇంతో సేప యిదిలిచ్చటం తప్ప మెట్టకు పోయి కాపీనీల్లు తాగుదామన్నా కాలు కదపనిచ్చారా? ఒక్క పైసా ఎక్కువిచ్చినారా? వారం కితం బోటు నీట్లోకి తోసేప్పుడు డయవరు సూడకుండా రివర్సు సేత్తే ఎనక పంకాబోనులో నా కాలు పడి సితుకుడయినాదని మీ మేనల్లుని సేత కవురంపితే ముందు ఏటి పని సూడండని కసిరి కొట్నేదూ?.. మీకు నేను సొంత బిడ్డనా? అందుకే గావాల వొచ్చి సూసినారు. నెత్రుగారు కుంటా నేనే సీరాల పెబుత్త ఆసుపత్తికిపోయి కట్టు కట్టిచ్చుకున్నందుకు ఏబై రూపాయలై నాది. నమ్మకం లేదా? ఈ కట్టు సూడండి"అని కుడికాలు బ్యాండేజీ చూపించి ఆ ఏభై నా మొహాన పారేయండీ అప్పు తీర్చి ఆలోసిత్తాను అన్నాడు, కోపం ఆపుకోలేని దుర్గ.

"నిజంబాబూ! వోరం నుంచి జెరం ఏగిపోయి మూసిన కన్ను తెర్వకండా మూలుగుతూ ముడుక్కొనున్నాడు. లెగలేదు. యింట్లో మొదటి కానుపు ఆడది నెల్లు నిండి ఇయ్యాలో రేపో అన్నట్టు నొప్పలడి పోతంటే మూడు రోజుల్నుంచి సేతిలో ఏవీ లేక ఎంత యిరుకున బడినావో పైని బగవంతునికే ఎరిక"సోమి బాధంతా వెల్లబోసుకున్నా విన్పించుకోనట్టు దుర్గని ఎగాదిగా చూస్తూ,"మీ యింట్లో బాధ నాకెందుకూ? నాకూ సవాలక్ష యిబ్బందులున్నై తీరుత్తావా? ఏదో బోను గీసకపోయినందుకు యింత రాద్ధాంతవా? అజాగ్రత్తగా

## ఉద్యమం

తల్లి ఊపరితో వూపిరులూదుకునే ప్రక్రియ
జననాశికి ఓ క్రతువు
అది భూమ్యాకాశాల అంతరాల నిర్ణయం
కానీ, మరణానికి విక్రతువులు
చావు భయంతో లెక్క పెడుతూన్న ఆకాశంలో
నక్షత్రాలు
వేల గొంతుకల ప్రకంపనాల ఉధృతం
ఝుంఝూ మారుతంలా మిన్నూ మన్నూ ఏకం
చేసేధార
అది తుపాకి గొట్టంలో నుంచి జారి గాలికి
పోయే పోరాటం కాదు
గుండెల్లో కదిలి గొంతుకల వేడికి స్రవించిన
అగ్ని పర్వతం
విజయం తప్ప మరణమే లేని ఉద్యమం
కాలే కడుపులతో మండే మనుషులు వేసే
పిచ్చికేక
శ్మశానంలో పాతి పెట్టితే జనారణ్యంలో ధ్వరిల్లిన
తొలికోడికూత
అణువుగా మొదలైన పరమాణువు పర్యంతం
వ్యాపిస్తుంది
ఊపిరి నిలిచినా ఉద్యమం గెలుస్తుంది
స్క్వేరుల్లో నెత్తుటి లోయలోనికి విసిరేస్తే
ఎర్ర సముద్రాన్ని నిట్టనిలువునా చీల్చుకుని
తిరిగి ఊపిరి పోసుకున్న ప్రజా ఉద్యమం అది!

— అడుసుమల్లి ప్రభాకరరావు




వున్న పెతి అడ్డమైన గాడిదకూ యాభై, అరవైలు దానం సెయ్యటానికి నేనేం దొంగనోట్లు గుద్దు కోటం లేదు. ఒక్క నయాపైసా రాల్చను. డూటీ కొత్తావా? లేదా?" అని అగ్గిమీది గుగ్గిలంలా చిట పటలాడిపోయాడు లక్ష్మయ్య.

"రాను!" దుర్గ తెగేసి చెప్పాడు.

"నెల మద్దెలో ఎట్టా డూటీ ఎగ్గొడ్తావో నేనూ సూత్తాను."

"సూడు!"

"నెల జీతం ముందే దానికీ, దీనికని వంకబెట్టి మింగేశానుగదా, ఇంకో బోటు మీనికి పోతే ఈడేం సేత్తాడ్లే అని యిరగబడ్తన్నావేమో, నేను మూడు బోట్ల వోనర్ని, బోటు వోనర్ల పెద్దని. నిన్ను మహా గంగ ముంగిట్లోనే నిలిపి నీల్లు తాగిత్తాను జాగర్త!"

"సొంద్రం నీ సొంతంగాదు సేతులడ్డం పెట్టి ఆపటాకి బోటు మీన గాకుంటే నీటు తెప్పమీనైనా ఏటకి పోతాను. దమ్ముంటే అడ్డుకో!"

పోట్టాటతగ్గి లక్ష్మయ్య పాటుకు వస్తే, కాలి గాయానికి కాస్తైనా ప్రతిఫలమిస్తే యింటి అవ సరాలు గట్టెక్కుతాయని సోమి ఆశించిందంతా అడియాసే అయింది. తగాదా చిలికి చిలికి గాలివానైంది. అవమానంతో దుర్గ ఆగ్రహిస్తే, అహంకారంతో లక్ష్మయ్య రెచ్చిపొయ్యాడు.

చివరికి న్యాయంగా పొట్లాడుతున్న తమ్ముడ్ని మందలించలేక "కాస్త నిమ్మలిచ్చండి లచ్చుమయ్య గోరూ!" అని వేడుకున్నా, అదీ ఎదురు తిరిగింది — "చెప్పేది ఆ ఎదవకే సెప్పరా," అని తోక తొక్కిన పాములా బుసగొడ్తూ పొయ్యాడు లక్ష్మయ్య.

ఇంకేముందీ, ఆసరా అనుకున్న బోటు వుద్యో గంకాస్త వూడిపోయింది. ఎలా బతకాల? ఒక్క రెక్క మీద దుర్గ కోలుకున్నదాకా ఈ సంసారం ఈదాలి. ఏమి చెయ్యాలో పాలుపోక దిగాలుపడి గుడిసెలోకి పోతున్న అన్నను, "ఆట్టా ఇపోయినావే మన్నా" అని తమ్ముడు వెంబడించాడు.

చాపపై పడుకోనున్న భార్య పక్కనే కూర్చొని "ఎలా వుంది పోవేరి?" అని గాబరాపడిపోతున్న సోమిని "ఎటూ రొండు రోజుల వరకి పెస వించదని మంతరసాని సెప్పినాదిగదా, ఏటకెల్లిరా. నేనూ, పెద్దాదినా, సిన్నాదిన్ని కని పెట్టుకుంటా" మని, తమ్ముడూ, పోయిరమ్మని భార్యా తొందర పెట్టినాకే ఇంట్లోంచి బైటపడ్డాడు. సంద్రం చేరే సరికి వాన తగ్గింది. తెల్లని చేప పొలుసులు పరచినట్టు తీరమంతా వెన్నెల. అలలు నొవ్వలు పడ్తున్న పోవేరి మూల్గుల్లా విన్పించాయి సోమికి.

అలస్పెమయినాదేమని సోమి పెద్దన్న పలక రించి ధైర్యం చెప్తే యింకో తెప్పలో వసంత్రావూ, పోలయ్యా పేటలో ఆడోల్లు ఆదుకుంటారని భరో సాయిస్తే మిగతా జాలర్లు వొచ్చాక బిడ్డనెత్తుకుం టావని వుత్సాహ పరిస్తే అన్నతో కల్సి వేటలో మునిగిపొయ్యాడు. ప్రవాహాన్ని బట్టి చేప పడ్తుం దని మైళ్ళకు మైళ్ళు దూరం వలతాడు వదుల్తూ పోతున్నారు. చేప దండిగా పడ్తోంది. నార్నీ, కలంద లాంటి ధర గల రొయ్య గూడా కొద్దిగా చిక్కుతోంది. ఇద్దరి మనసుల నిండా ఆనందం, ఒకర్నొకరు వుల్లాసపరుచుకుంటూ పొంగిపోతు న్నారు. ఎంత సేప షావుకారికి పోతుందో, ఎంత మిగులుతుందో, రొయ్య లెంతకమ్మాలో, లెక్కేసు కుంటున్నారు, ఎక్కడెక్కడ అప్పు తీర్చాలో ఎంచు కుంటున్నారు.

"వురుడు కర్సు ఎంతవుద్దన్నా?

నీకా బయమొద్దు, ఈ తాప నుంచి సేదే సేప నువ్వేతీసుకో వురుడు బెమ్మాండంగా సేద్దాం, పేట పేటంతా సారా పేకట్లతో వొద్దు బాబో అన్న దాక మునిగితేలాల, అన్నా—" తమ్ముడి ఆప్యా యత సముద్ర కెరటాల్లా నిబ్బరంగా నిశ్చలంగా ఆరాట పడుతుంటే గాలి స్తంభించినట్టు వుక్క పోతపోసింది. నీల్లు పోసుకున్నా వాళ్ళకి వేడి తగ్గ లేదు. లంగరేసి అట్టపడుకొని కిందికి చూచి 'అలలు అడుగ్గా ఎల్తున్నై, గాల్లోన వొత్తుందేమో' అని అనుకుంటుండగానే దొంగ తుఫాను సుడ్లు సుడ్లుగా తిప్పి యిద్దరికళ్ళూ తోడేసింది. మెట్ట గాలితోసి తెరచాప చినిగి నావ తెడ్డుపడి అన్నతల పగిలి పడిపోతే తమ్ముడు ఏడుస్తూనే పడవ గెడకి తుండు గట్టి పైకెత్తి అపాయం నుండి ఆదు కోమని గొంతు పిగిలేట్టరిచాడు. ఎవరూ చెంతకు రాలేదు, వార్ని అందుకోలేదు.

విసురు విసురుగా వీచే గాలికి తెప్ప ఎటు పోతోంది సోమికి తెలియనే లేదు. సముద్రమంతా పొగకప్పినట్టు ఒకటే చిమ్మ చీకటి. ఏరియా పోల్చు కుందామని ఎంత ప్రయత్నం చేసినా సాధ్యం కాలేదు. మొండి ధైర్యంతో కింది గెడలాగి లంగరు తాడూ, వలా బిగిస్తుంటే మెరుపు మెరిసి వురుము వురిమింది. పిడుగు పడ్డట్టు తెరకొయ్య విరిగి విరు చుకుపడి తెప్ప జర్రున నీట్లోకి జారటమే తెల్సు సోమికి. తర్వాతేం జరిగిందో స్పృహ లేదు.

తెలివొచ్చే సరికి బొబ్బర్లంక పట్టపోల్లు తన్ను రక్షించి దరికి చేర్చారని సోమి తెల్సుకున్నాడు. అన్న ఏమైనాడో!

అప్పటికే నాలుగు రోజులు గడిచింది. గాయాలు. పోట్లెత్తుతున్నా పోవేరి పరిస్థితికి బెంబేలు పడ్తున్న సోమిని వాళ్ళే వూరడించి నిజాంపట్నం దింపారు. రేవుకి చేరుతుండగానే ఒక్కొక్క కీడు వార్త అతన్ని కలచివేసింది.

అన్న సముద్రంలో పోయాడు. వదినె ప్రస వించలేక ఆసుపత్రిలో చేర్చాలంటే అప్పు దొరక్క అల్లాడి మరణించింది. ఇరుగు పొరుగు గర్భంతో చచ్చిపోయిందని గ్రామం దాటించి ప్రక్కనబెట్టి ఆ రోజంతా సోమి కోసం తెప్పలేసుకు వెదికి వేసారి దానం చేశారట!


వింటున్నకొద్దీ సోమి పిచ్చివాడయ్యాడు పట్ట పోళ్ళు పట్టుకున్నా ఆగలేదు, భార్యను కాల్చిన చోటుకి పరుగెత్తాడు. బూడిద చేతికి తీసుకొని వెర్రిగా పలవించాడు, పలవించాడు, ఇసుకలో దొర్లాడాడు. అన్న అభిమానం తలుచుకొని అన్న తిరిగిన చోట్లే మళ్ళీ మళ్ళీ తిరిగాడు, ఏంలాభం?

సముద్రమంత చీకటి సరిగతోవు చేసే శోకశ బ్దంతప్త సోమికి ఏమీ మిగల్లేదు. అతడిప్పుడు తెడ్డు లేని తెప్పే. చుక్కాని లేని చూపే! అన్నీ కోల్పో యిన అభాగ్యుడిలా చావలేక బతుకుతున్నాడు.

కథ ముగించాడు కొండలు.

ఆనందం, సుబ్రమణ్యం మొహాల్లో వుద్వేగం కన్పించింది. "ఒక చెట్టు నిలువునా ఎండిపోయింది" అన్నారు. "స్వామి యిప్పుడున్నాడా? అయన్ను పలక రిస్తే ఆనాటి విషాదం మరింత స్పష్టంగా చెప్తాడేమో!" అన్నాను. రచయితగా పూర్తి సమాచారం గ్రహిస్తే నిండుతనం వస్తుందని.

సన్నివేశం యింకా పండుతుంది! సుబ్రమణ్యం మాటల్లో యింకా బాగా నటించే రసవత్తర సన్ని




వేశం చేజారి పోతుందేమోనన్న ఆతృత ధ్వనించింది. ఏం కొండలూ, ఆయన్ని కలుద్దామా? అడిగాను. వాడిప్పుడు నల్లగా చేవదేలిన శరీరంతో కొండలా బాగానే వున్నాడు. మాట మాట పేనుతున్నట్టు చెప్పాడు.

ఇంతలో బయ్ బయ్ మని హారను శబ్దం విన్పించి సుబ్రమణ్యం"అదిగో చీరాల బస్సొస్తోంది. ఇది పోతే మళ్ళీ రాత్రి 9 గంటలకు, మనకి చాలా పొద్దుపోతుంది పదండి"తొందర పెట్టాడు.

నా మనసులో యింకా ఆ స్వామిని కలుద్దామనే వుంది. గోనెపట్టా కుట్టిన చేపలతట్టని బస్సులోపెట్టి ఎవర్నో ఎక్కించి వస్తున్న జాలరి యుకుడ్ని పిలిచి అతని చేతిలోంచి ప్లాస్టిక్ సంచీ తీసుకున్న కొందర్ని యింకా అనుమానం తీరక "మాకు టైమయింది, మరోసారి వద్దామా?" అడిగాన్నేను."ఎందుకు మాస్టరూ, మళ్లీ బోల్డు కర్సులవుతాయి. ఆ సోమిని నేనే. పూర్తిపేరు ఏడుకొండల సోమి. కొందరు కొండలంటే, నా ఆడది సోవి అనేది" అన్నాడు. సంచితెచ్చినతన్ని "ఈడు నా తమ్ముడు దుర్గ, తెప్పకెల్లి యిప్పడే వొచ్చాడు. బాగత్తునితో సీరాల సరుకు పంపుతున్నాడు అమ్మకానికని అంటూ ఈ కథెందుకుపయోగిత్తారో చెపతారా?"అని అడిగాడు." నాటకం రాస్తే ప్రదర్శిస్తాం" సుబ్రమణ్యం డైలాగు చెప్పాడు.

"ఎక్కడ వేస్తారూ మేము సూడొచ్చా?"

"చాలా కష్టం, నాటిక సెలక్టయితే సబ్సిడీ వెయ్యి రూపాయలిచ్చి పరిషత్తుల్లో వేయించుకొంటారు. ఎక్కడ వేస్తామో ముందు మాకే తెలీదు. ఫస్ట్ ప్రైజు రెండు వేలు. ఉత్తమ నటులుగా వేరే బహుమానం గూడా వుంటుంది."

"రాసినందుకూ?"

"నాకూ ఉత్తమ రచన బహుమానమొస్తుంది," అన్నాను ఏడ్పులాంటి నవ్వుతో.

బస్సు దగ్గరకుపోతూ"వస్తాను కొండలూ! చీరాల వస్తేతప్పక నన్ను కలుస్తావుగా" అని అడ్రసిచ్చాను మొహమాటానికి.

"కుదరదండీ ఎప్పడూ"అంటూ చేతిలో సంచి పక్కనున్న ఆనందానికిచ్చాడు.

మాతో బస్సువరకూ నడచి"వనక్కం మాస్టారూ! వుంటాను" అని రెండు చేతులూ జోడించాడు, దుర్గ కూడా నమస్కరించాడు.

బస్సెక్కి కిటికీలోంచి చూస్తుంటే మా నుండి సెలవు తీసుకుంటున్న కొండలూ, దుర్గా సమాజం పరిష్కరించవలసిన ప్రశ్నలూ ముల్లులాంటి ఆవేదనలా నిలిచి" మరపడవల వోనర్లూ, షావుకార్లూ మా చాకిరి దోస్తే మీరు మా సంస్కృతినే లాభానికి దోపిడి చేస్తున్నారా?" అని అడుగుతున్నట్లనిపించింది. బస్సు చేరెడు దుమ్మూ పొగా వాళ్ళ మొహాన చిమ్మి త్వరత్వరగా కదిలింది.

కొన్ని గంటలు మాతో అరమరికలు లేకుండా మాట్లాడిన ఒక అమాయక స్వరూపం మెల్లగా కనుమరుగయింది. అప్పటి వరకు జాలర్ల అమాయక అంతరంగంలా మా చుట్టూ విన్పించిన సంద్రం హోరు పూర్తిగా దూరమైంది.

కాని నా మనస్సు నిండా వారి జీవితమే ఎగసి పడ్తోంది. నాటకంలోఎన్ని పాత్రలుంచాలీ, ఏ దృశ్యంతో ప్రారంభించాలీ, పతాక సన్నివేశం ఎలా ముగించాలీ, సముద్ర తీరంగా రంగస్థలానికి ఎలాంటి బ్యాక్ కర్టెన్ గీయించాలీ, సైడ్ కర్టెనెలా వుండాలీ, ముఖ్యంగా టైటిల్ ఏం పెట్టాలీ, అన్నీ తెగని ప్రశ్నలే.

నాకు చెరోప్రక్క కూర్చున్న సుబ్రమణ్యం, ఆనందం ఏదేదో మాట్లాడుకుంటున్నారు. మురిసి పోతున్నారు. ఉన్నట్టుండి సుబ్రమణ్యం నా భుజం తడ్తూ"ఏంటి మాష్టారూ, యింకా కళ్ళు మూసుకుని ఆలోచిస్తున్నారూ! మనకు బ్రహ్మాండమైన ప్లాటు దొరికింది, ఇంక అన్ని పరిషత్తుల్లోనూ మదే గెలుపు"సంతోషం చిందించాడు. ఆనందం సంచిలోని చందవాలు చూపించి సంబరపడిపోతూ"ఈ మూడు చందవాలు మార్కెట్లో 40 రూపాయలైనా వుంటాయి. కొండలు గాడికి పెట్టిన టిఫిన్లూ, టీలూ పోతే మనకే 25 రూపాయలు లాభం. ముగ్గురం తలోటి తీసుకుందాం!"అన్నాడు తన గుడ్డల వ్యాపారం ఫక్కీలో.

ఇంటి కొచ్చింతర్వాత నేనిచ్చిన చందవాని చూచి "వూరకే యిచ్చారా?"అని మా శ్రీమతి అడిగింది.

మూడిచ్చారని చెప్పాను.

"పాపం! సుబ్రమణ్యం అన్నయ్య వాళ్ళు నటులు గదా! పట్టపోల్లు చెప్పేదంతా ఎంతో అభిమానం, సానుభూతీ వున్నట్టు విను ంటారు. అందుకే కరిగిపోయి వాళ్ళ కష్టం యిచ్చారు. ఒక్కోచేప మార్కెట్లో 15రూ.లు చేస్తుంది"అన్నది.

కూర వుడుకుతున్నంత సేపూ చట్టినిండిన చేప తాజాతనం గురించీ, పట్టపోళ్ళ తెలివిలేని తనం గురించీ ముచ్చటిస్తూనే వుంది. కంచంలో వడ్డించిన కూర సెగలు, పొగలు గక్కుతూ 'జాలర్ల మీద రాసే మీ రచనగూడా నటనే గదూ? అని అడుగుతున్నట్లనిపించి నిర్ఘాంతపోయి కళ్ళనిండా కలవరంతో తలెత్తాను.

"ఏంటా ఫీలింగూ? మీరూ నటిస్తున్నారా? అవున్లెండి, ఎలా నటించాలో రాసే మీరు నటులకి మించిన నటులు - మహా నటులు కాదా?"అని నిలదీసిందామె.

చేతిలోకి తీసుకున్న చందవా ముక్క తెల్లగా శృతి కలిపి నవ్వుతున్నట్లుండి మరోసారి నేను దిగ్భ్రాంతి చెందడంచూచి, "ఆహా! నటనంటే యిదే కాబోలన్న యిల్లాలి మాట ఆ చెవిలోంచి ఈ చెవిలోకి కల్లోలకెరటంలా గింగుర్లెత్తింది.

●